

సోలార్ హబ్‌గా ఉమ్మడి అనంత



కదిరేపల్లిలో రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ



గుడిబండలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే, నాయకులు

- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- నీచ రాజకీయం జగన్‌కే సాధ్యం: మంత్రి అనగాని
- చంద్రబాబు వల్లే జిల్లా అభివృద్ధి: మంత్రి సవిత
- కూటమితో రాష్ట్రం మరింత అభివృద్ధి: మంత్రి సత్యకుమార్
- మడకశిరలో సబ్ స్టేషన్‌లు, ఆర్ఎస్‌కే ప్రారంభం

మడకశిర/నెట్‌వర్క్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాను సోలార్ హబ్ చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో శుక్రవారం ఆయన రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్‌తో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా నాలుగు సబ్‌స్టేషన్లను ప్రారంభించారు. మ రో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. తొలుత మడకశిరలో ఎమ్మె ల్యే ఎంఎస్ రాజు క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించి, మాట్లాడారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా చేసేందుకు నాలుగు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు ప్రారంభించి, మరో మూడు సబ్ స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు తెలిపారు. వ్యవసాయానికి 9 గంట లు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం త్వరలో సోలార్ ప్రాజెక్టులు కూడా రానున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం రాష్ట్రానికి 20 లక్షల కనెక్షన్లు మంజూరు చే సిందన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 10 వేల కనెక్షన్లు ఇస్తున్నట్లు తెలిపారు. మడకశిర ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటుకు అనువైన ప్రాంతం కావడంతో రాబోయే రోజుల్లో ఇక్కడికి పెద్ద ఎత్తున సోలార్ ప్రాజెక్టులు వస్తాయన్నారు. ప్రతి సబ్‌స్టేషన్ సమీపంలో సోలార్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం టెండర్లు కూడా పిలిచినట్లు వెల్లడించారు.

పెద్దిరెడ్డి అక్రమాలను బయటకు తీస్తాం

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూ అక్రమాలను, రెవెన్యూ రికార్డుల దహ నం వంటి వాటిని వెలికి తీస్తామని రాష్ట్ర రె వెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ బాగోతాలు బయటపడటం, దాల్మియా సి మెంట్స్‌కు సంబంధించి ఆస్తులను ఈడీ అటాచ్‌మెంట్‌తో తెరపైకి టీటీడీ గోశాలను తెచ్చారని ఆరోపించారు. ఇంత నీచ రాజకీయం జగన్ ఒక్కడికే

(మిగతా 7వ పేజీలో..)

రెండేళ్లలో వైద్య కళాశాల పూర్తి చేస్తాం

వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



ధర్మవరంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పెనుకొండ వైద్య కళాశాలను రెండేళ్లలో అన్ని వసతులతో అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పది వైద్య కళాశాలలను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శుక్రవారం ఆయన మడకశిరకు వెళ్తూ మార్గమధ్యలో పెనుకొండలోని సన్నిహితుల ఇంటికొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రతి జిల్లాలో ఓ వైద్యకళాశాల ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 17 కొత్త కాలేజీలను మంజూరు చేసిందన్నారు. వీటి ఏర్పాటు ప్రభుత్వ రంగంలోనా, ప్రైవేట్ రంగంలోనా అనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి వదిలేసిందన్నారు. కళాశాలల ఏర్పాటుకు రూ.8,800 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా పనులు మొదలుపెట్టి నాలుగేళ్లలో 14 శాతం పనులుచేసి రూ.2,100 కోట్లు ఖర్చు చేసిందన్నారు. పెనుకొండలో ఉన్న వైద్య కళాశాల పునాదులు వేసి, ఒక అంతస్తు మాత్రమే నిర్మించిందన్నారు. కొత్త ప్రభుత్వం వైద్య కళాశాలల నిర్మాణానికి దృఢ నిశ్చయంతో ఉందన్నారు.

హక్కులను సాధించుకుందాం..

ధర్మవరం: ఐక్యంగా హక్కులను సాధించుకుందామని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎంపికైన జయశ్రీ సన్మానసభను పట్టణంలోని పోలా ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాల్లో అధిక శాతం బీసీలకే అందుతున్నాయన్నారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. బీసీలంతా ఏకమైతేనే ఏ సమస్యనైనా సాధించుకోవచ్చన్నారు. రాజకీయాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో బీసీసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్రావు, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవి, రాష్ట్ర నాయకుడు క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ పట్టణాధ్యక్షుడు పరిశే సుధాకర్ పాల్గొన్నారు.

సదుపాయాలకు బంక్!

- పెట్రోల్ బంకుల్లో కానరాని కనీస సౌకర్యాలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చాలా పెట్రోలు బంకుల వద్ద మౌలిక సదుపాయాలు ఏమాత్రం కానరావడం లేదు. తాగు నీరు, మరుగుదొడ్లు, గాలి మెషీన్ వంటి సౌకర్యాలు ఏమాత్రం కానరావు. దీంతో అనేక మంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం 89 పెట్రోల్ బంకులు ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. వీటిలో చాలా వాటిల్లో నిబంధనల మేరకు మౌలిక సదుపాయాల కల్పన లేదనే విమర్శలు వినవస్తున్నాయి. అయితే అధికారులు వీటిని ఏమాత్రం పట్టించుకోలేదని పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతులు ఇలా...

ప్రధానంగా బంకుల యజమానులు వినియోగదారులకు ప్రప్రథమంగా ఎయిర్ మెషీన్ ఏర్పాటు చేసి దాని ద్వారా వినియోగదారులకు ఉచితంగా ఎయిర్ అందించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఒక ఉద్యోగిని నియమించాల్సి ఉంటుంది.

ఫైర్ సేఫ్టీ పరికరం

వాహనాలకు పెట్రోల్ డీజిల్ నింపుతున్నప్పుడు ఏవైనా కారణాలతో మంటలు రేగితే అదే బంకులో ఉన్న ఫైర్‌సేఫ్టీ పరికరాన్ని వాడుకునే విధంగా చూడాల్సి ఉంటుంది. అవి చాలా బంకుల్లో కానరావడం లేదు.

అత్యవసర కాల్ సౌకర్యం

అత్యవసర పరిస్థితుల్లో పెట్రోల్‌బంకులో ఫోన్ చేసుకోవడానికి ఉచితంగా టెలిఫోన్ సౌకర్యం కల్పించాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ఎన్నిబంకుల్లో ఈసౌకర్యం ఉందో అధికారులకే తెలియాలి.

ప్రథమ చికిత్స బాక్సు

ప్రతి పెంట్రోలు బంకులోనూ ప్రథమ చికిత్స బాక్సు ఉండాలి. వాహనాదారులకు ఏదైనా గాయం అయినా లేదా అత్యవసర పరిస్థితుల్లో దీన్ని వాడుకునే వెసులుబాటు కల్పించాలి. అందులో ఉన్న మందులు ఎప్పటికప్పుడు గమనించి గడువు ముగిసిన వాటిని బయట పడేసేలా ప్రథమ చికిత్స బాక్సును నిర్వహించాలి.

తాగునీరు, ఉచిత వాష్‌రూం ఏర్పాట్లు

పెట్రోల్ బంకుల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి. వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేసి, వాహనదారులకు పరిశుభ్రమైన నీటిను ఉపయోగించుకునే అవకాశం కల్పించాలి. వాహనాదారులు అవసరమైన సమయాల్లో వాష్ రూంను ఉపయోగించుకోవడానికి వాష్‌రూంలు ఏర్పా టు చేయాలి. వీటిని సాధారణ ప్రజలు కూడా ఉపయోగించుకోవచ్చని నిబంధనల్లో పొందుపరిచారు. ఇందుకు సంబంధించి ఎలాంటి రుసుం వసూలు చేయరాదు.

సౌకర్యాలు కల్పించాల్సిందే..



వాహన వినియోగదారులకు పెట్రోల్ బంకు యాజమానులు మౌలిక సదుపాయాలు కచ్చితంగా ఏర్పాటు చేయాల్సిందే. నిబంధనలు ఉల్లంఘిస్తే బంకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

-వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి, శ్రీసత్యసాయి జిల్లా

కాటేసిన కరెంటు తీగ 7

పీఈటీలకు న్యాయం జరిగేనా..?

- వైసీపీ హయాంలో తీరని అన్యాయం
- బదిలీల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపు
- కామన్ సీనియారిటీని అమలు చేయాలి: ఉపాధ్యాయ సంఘాలు

కొత్తచెరువు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో బదిలీల్లో పీఈటీలకు తీరని అన్యాయం జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న బదిలీల్లోనయినా తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. వైసీపీ ప్రభుత్వం 2023 మే నెలలో పీఈటీ, పీడీ (ఫిజికల్ డైరెక్టర్)ల బదిలీలను నిర్వహించింది. నిబంధనలకు విరుద్ధంగా పీఈటీ, పీడీలకు వేర్వేరుగా బదిలీలు నిర్వహించింది. పీడీలుఆన్‌లైన్‌లో కోరుకున్న ప్రదేశాలకు బదిలీపై వెళ్లారు. పీఈటీలకు మాత్రం డీఈఓ కార్యాలయంలో మ్యానువల్‌గా బదిలీలు నిర్వహించారు. పీఈటీలకు వచ్చిన పాయింట్లు, సీనియార్టీ, స్పౌజ్‌తో సంబంధం లేకుండా బదిలీలు చేశారు. విద్యాశాఖ అధికారులు బదిలీల్లో జిల్లా కేంద్రానికి 90 కిలో మీటర్ల దూర ప్రదేశాలను చూపించి కోరుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా బదిలీల్లో పీఈటీ పోస్టులు ఉంటే ఎంచుకోవాలి, లేకుంటే ఖాళీల కింద పీడీలంతా ఎంచుకోగా మిగిలిన పోస్టులను ఎంచుకోవాలని జీవోను ఇచ్చింది. దీనివల్ల 45 పాయింట్లు ఉన్న పీఈటీలు కూడా సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. రెండేళ్ల సర్వీసు ఉండి 10 పాయింట్లు ఉన్న పీడీలకు మాత్రం జిల్లా కేంద్రానికి సమీపంలోని ప్రదేశాలను ఎంచుకొనే అవకాశం ఏర్పడింది. సీనియారిటీ ఉన్నా పీఈటీలకు బదిలీల్లో అన్యాయం జరిగిందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండపడుతున్నారు.

బదిలీల కోసం పీఈటీల ఎదురుచూపు

బదిలీల కోసం ఏళ్ల తరబడి పీఈటీలు ఎదురుచూస్తున్నారు. 30 ఏళ్లగా పనిచేస్తున్న పీఈటీలకు కూడా బదిలీల్లో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీల్లో సమన్యాయం పాటించకపోవడంతో ఏళ్ల తరబడి దూరప్రాంతాల్లో పనిచేయాల్సి వస్తోంది. కొందరు పీఈటీలు 15 నుంచి 35 ఏళ్లపాటు సర్వీసులో ఉంటూ విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దినా గత ప్రభుత్వంలో చేపట్టిన బదిలీల్లో అన్యాయం జరిగింది. కామన్ సీనియారిటీని అమలు చేయాలని పీడీ, పీఈటీ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని రద్దు చేయాలని కోరుతున్నారు. ఇన్ సర్వీసులో వేతనంతో కూడిన బీపీఈడీని చేసుకునే విధంగా పీఈటీలకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

సర్వీసు ఆధారంగా బదిలీలు చేపట్టాలి



ప్రభుత్వం త్వరలో చేపట్టే ఉపాధ్యాయ బదిలీల్లో పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్ పీడీలతో సమానంగా సర్వీస్, సీనియారిటీ, స్టేషన్ సీనియారిటీ పాయింట్ల ఆధారంగా తీసుకోవాలి. తొలుత జిల్లాలో మొత్తం ఖాళీలను పరిగణలోకి తీసుకోవాలి. వచ్చిన మొత్తం పాయింట్లు చూసి కౌన్సెలింగ్ నిర్వహించాలి. బదిలీల్లో అందరికీ న్యాయం జరిగేలా చూడాలి.

-అనూరాధ, పీఈటీ, జడ్పీహెచ్ఎస్, దొన్నికోట, నల్లమాడ మండలం

గత బదిలీల్లో అన్యాయం



రాష్ట్ర వ్యాప్తంగా 600కుపైగా పీఈటీలకు 2023లోజరిగిన బదిలీల్లో అన్యాయం జరిగింది. సత్యసాయి జిల్లాలో పీఈటీలు 49 మంది ఉన్నారు. ఒక పాఠశాలలో రెండు కంటే ఎక్కువ పీడీ పోస్టులు ఉన్నచోట పీఈటీలకు అవకాశం ఇవ్వాలి. ఇన్ సర్వీస్ బీపీఈడీ చేసుకోవడానికి అవకాశం పీఈటీలకు కల్పించాలి. సమ్మర్ కోర్సుల్లో కూడా పీఈటీలకు అవకాశం ఇవ్వాలి.

-బాబాఫకృద్దీన్, జడ్పీహెచ్ఎస్, టి.కుంటపల్లి, ఓడీసీ మండలం

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

గొర్రెల సంతకు వెళ్లిన ముగ్గురు జిల్లావాసుల మృతి

వివరాలు 7లో..

చెట్టుకు 150 కాయలు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సాధారణంగా వేరుశనగ చెట్టుకు 20 నుంచి 30 కాయలు కాస్తుంటాయి. మండల కేంద్రానికి చెందిన అన్నదమ్ములైన రైతులు ఖాజీవలీ, ఖాజీ సాదిక్ సాగుచేసిన వేరుశనగ విరగ్గాసింది. ఒకే చెట్టుకు 150కిపైగా కాయలు కాశాయి. రైతుల ఇంట లాభాల పంట పండించాయి. అన్నదమ్ములు అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ సమీపాన తమకున్న ఐదెకరాల పొలంలో బోరు బావికింద కే7 గోల్డ్ రకం వేరుశనగ విత్తనాన్ని సాగు చేశారు. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. చెట్టుకు 150 కాయలు ఉండడాన్ని చూసి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 40 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో 45 కిలోల బస్తా రూ.3,600 ధర పలుకుతోందన్నారు. ఈ లెక్కన పెట్టుబడిపోను ఎకరాలో రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



విరగ్గాసిన వేరుశనగను చూపుతున్న ఖాజీవలీ

బాబా జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలి

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహిం చాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రులు అనగాని, గొట్టిపాటి రవికుమార్‌ను శుక్రవారం ఆమె మడకశిరలో కలిశారు. ఈ సందర్భంగా బాబా జయంతి ఉత్సవాలకు ప్రభుత్వ నిధులు కేటాయించాలని కోరారు. పుట్టపర్తి అభివృద్ధి పనులకు రూ.885 కోట్లు అవసరమవుతాయని జిల్లా అధికారులు అంచనాలు రూపొందించారన్నారు. నియోజకవర్గానికి ఐదు సబ్ స్టేషన్లను మంజూరుచేయాలని విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎమ్మెల్యే కోరారు. అవసరమైనంతమేరకు నిధుల మంజూరుకు కృషిచేస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సోలార్‌హబ్‌గా ఉమ్మడి జిల్లా

(5వ పేజీ తరువాయి)

సాధ్యమన్నారు. వైసీపీ నాయకులకు హిందూతత్వం మీద నమ్మకం లేదన్నారు. అందుకే ఇలాంటి వాటికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి ఆయనతోనే సాధ్యమన్నారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న మడకశిరకు ఈ రోజు సాగు, తాగునీరు అందుతున్నాయంటే అందుకు కారణం చంద్రబాబు అని తెలిపారు. 2014-2019 గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించారని, కియ పరిశ్రమ తెచ్చారని, తద్వారా జిల్లా అభివృద్ధికి బాటలు వేశారన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కృషి వల్ల నియోజకవర్గం రూపురేఖలు మారబోతున్నాయని పేర్కొన్నారు.

రూ.7వేల కోట్లతో సోలార్ పార్క్

మడకశిర నియోజకవర్గంలో రూ.7వేల కోట్లతో సోలార్‌పార్క్ నిర్మించబోతున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఎంఎస్‌రాజు చేసిన పోరాటం అభినందనీయం అన్నారు. సూర్యాఘర్ పథకం వల్ల వినియోగదారుడుగా ఉన్న సామాన్యుడు విద్యుత్ ఉత్పత్తిదారుడుగా మారుతాడన్నారు. భవిష్యత్తులో ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఆవుల మృతిపై భూమన కరుణాకర్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే గోశాల సందర్శనకు ఎందుకు వెళ్లలేదని, ఇంటి దగ్గరే ఉండి రోడ్డుపై ధర్నా చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు

మడకశిర నియోజకవర్గం అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో రాష్ట్రంలో నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపడమే లక్ష్యం అన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అనుభవంతో నియోజకవర్గాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట ప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, దగ్గుపాటి వెంకటప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు అంజినప్ప, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సురేంద్ర, డీఈ భూపతి, ఏడీ రఘునాథ్, ఏఈ సిద్దేశ్వర, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

గ్రామాల్లో ఘన స్వాగతం

విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రులకు వైబీ హళ్లికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మంత్రులకు గజమాలలు వేసి స్వాగతం పలికారు. గ్రామం నుంచి సబ్‌స్టేషన్ వరకు ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. రొళ్ల మండలంలోని రంగనపల్లి గ్రామంలో కూడా మంత్రులు, ఎమ్మెల్యేలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మార్కెట్‌యార్డు చైర్మన్ గురుమూర్తి ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం: అనగాని



పి.శివరం గ్రామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

ప్రారంభించిన సబ్‌స్టేషన్లు

- మడకశిర మండలంలో వైబీహళ్లి, కదిరేపల్లి
- అగళి మండలం ఇనగలూరు
- అమరాపురం మండలం పి.శివరం గ్రామం

భూమిపూజ చేసినవి..

- రొళ్ల మండలం రంగనపల్లి
- గుడిబండ మండలం కేకే పాళ్యం
- మడకశిర మండలం గుండుమల గ్రామం

జిల్లాలో నియోజకవర్గం అభివృద్ధిపై ఎమ్మెల్యేల నుంచి వచ్చే ప్రతిపాదనల పట్ల సానుకూలంగా స్పందించాలని జిల్లా కలెక్టర్ చేతన్‌ను రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా శుక్రవారం మడకశిర ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన తన సహచర మంత్రులతో కలిసి కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాల పట్ల సానుకూలంగా స్పందించడంతో పాటు వేగంగా ఫైల్ పూర్తి చేయాలన్నారు.

పార్టీ బలోపేతానికి అంకితం కావాలి: మంత్రులు

ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రివ్యూ మీటింగ్ అనంతరం జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తదితరులు మాట్లాడుతూ.. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ముందుగానే గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి కమిటీలను పూర్తి చేయాలని సూచనలు చేశారు.

క్రైం కార్నర్

నీటి కొళాయి వద్ద ఘర్షణ.. పలువురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డే కాలనీలో నీటి కొళాయి వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వడ్డే కాలనీలో ఉన్న బోయ ప్రకాష్ చిల్లర కొట్టు నిర్వహిస్తున్నాడు. ఆ దుకాణం సమీపంలో నీటి కొళాయి ఉంది. ఆ నీటి కొళాయికి సమీపంలోనే బోయ హనుమంతరాయుడు, వడ్డే సాంబ, వడ్డే పవన్ కుటుంబాలు ఉన్నాయి. కొళాయి అక్కడ ఉండటం తన వ్యాపారానికి అడ్డుగా ఉందని, దాన్ని తొలగిస్తానని బోయ ప్రకాష్ తరచూ అంటుండేవాడు. ఈక్రమంలోనే శుక్రవారం కూడా గొణగడం ప్రారంభించాడు. దీనిని ప్రశ్నించిన హనుమంతరాయుడు, వడ్డే సాంబ, వడ్డే పవన్‌లను దూషించాడు. దీంతో ఘర్షణ జరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. బోయ ప్రకాష్ తన చిల్లర కొట్టులో ఉన్న కత్తెరలో హనుమంత రాయుడు, పవన్, సాంబలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితులను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘర్షణలో బోయ ప్రకాష్ అతడి కుమారుడు కూడా గాయపడినట్లు సమాచారం. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి మృతి



ప్రమాద స్థలం

అనంతపురం క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన నగర శివారులో శుక్రవారం ఉదయం జరిగింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం బండమీదపల్లికి చెందిన రంగారెడ్డి(46) అనంతపురంలో బంధువుల పెళ్లికి బైక్‌పై ఎన్‌హెచ్-44 రహదారి గుండా బయల్దేరాడు. నగర శివారులోకి రాగానే చంద్రబాబునాయుడు కొట్టాలకు చెందిన రెహమాన్ రాప్తాడుకు వెళ్లేందుకు బైక్‌పై రాంగ్‌రూట్‌లో వచ్చి రంగారెడ్డి వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో కింద పడిన రంగారెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రెహమాన్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రంగారెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఇతడికి భార్య లక్ష్మి, కొడుకు, కుమార్తె సంతానం. రెహమాన్ రాప్తాడులోని ఐషర్ షో రూంలో పని చేస్తున్నాడు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

105 మామిడి చెట్ల నరికివేత



నరికేసిన మామిడిచెట్లు

పెద్దవడుగూరు, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రచేడు గ్రామానికి చెందిన రైతులు సాగుచేసిన 105 మామిడి చెట్లను గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు నరికేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిత్రచేడుకు చెందిన రైతులు సన్ననారాయణ, లక్ష్మన్న, సూరి, అనిల్ మామిడి సాగు చేశారు. చెట్లను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. మూడేళ్ల వయసున్న 105 మామిడిచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. సన్ననారాయణకు చెందిన గడ్డివాముకు సైతం మూడునెలల క్రితం నిప్పు పెట్టారు. గ్రామంలో కక్షలు రేపేందుకే కొందరు వ్యక్తులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఆంజనేయులు.. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో తోటల్లో పరిశీలించారు. చెట్లను నరికేయడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చీనీలో రసాయన ఎరువులు తగ్గించాలి

- జిల్లా ఉద్యాన శాఖాధికారి ఫిరోజ్‌ఖాన్



తెగుళ్ల నివారణపై రైతులకు సలహాలు ఇస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి

గార్లదిన్నె, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చీనీ సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఫిరోజ్‌ఖాన్.. రైతులకు సూచించారు. సేంద్రియ ఎరువులే వినియోగించాలన్నారు. మండలంలోని ముకుందాపురం గ్రామం వద్ద చీనీ తోటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... వేసవిలో చీనీ పంటకు అధికంగా నల్లి, వేరుకుళ్ల తదితర తెగులు సోకుతాయన్నారు. వాటి నివారణకు టైకోటర్స్, సూడోమోనస్ తదితర మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. వేరుకుళ్ల, బంక తెగులు సోకితే చీనీ చెట్లు ఎండిపోతాయన్నారు. చెట్లకు తెగులు సోకిన వెంటనే గుర్తించి, ఉద్యాన శాఖాధికారుల సలహాలు పాటించాలన్నారు. చెట్లకు పచ్చి ఎరువులు కాకుండా ఎండిన ఎరువులు వేయాలన్నారు. తద్వారా చెట్లను తెగుళ్ల ఆశించవన్నారు. చీనీ చెట్లలో తెగళ్లను నివారించి, లాభసాటిగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ సర్వే చేపట్టిందన్నారు. జీపీఎస్ సాయంతో డ్రోన్ ద్వారా చీనీ తోటలకు సోకే తెగుళ్లను ఎప్పటికప్పుడు గుర్తించి, సస్యరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందన్నారు. ముకుందాపురం గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసిందన్నారు. ఇప్పటికే సుమారు 950 చీనీ తోటలను జీపీఎస్ ద్వారా ట్రాకింగ్ చేశారన్నారు. ఈ అవకాశాన్ని చీనీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి రత్నకుమార్, విస్తరణాధికారులు రామాంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ఖాళీలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో ఖాళీగా ఉన్న 71 బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ శుక్రవారం ప్రకటనలో కోరారు. 2025-26 విద్యా ఏడాదికి అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. టైప్-3 కేజీబీవీల్లో హెడ్ కుక్ 8, అసిస్టెంట్ కుక్ 19, డే అండ్ నైట్ వాచ్‌మెన్ 5, స్కావెంజర్ 5, స్వీపర్ 6, టైప్ 4 కేజీబీవీల్లో హెడ్‌కుక్ 6, అసిస్టెంట్ కుక్ 14, చౌకిదార్ 8 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఓపెన్ కేటగిరీ అభ్యర్థులకు 18 ఏళ్ల నుంచి 42 ఏళ్ల వరకూ వయో పరిమితి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 ఏళ్లు, మాజీ సైనిక ఉద్యోగులకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు వయోపరిమితి మినహాయింపు ఉందన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు [illegible] ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు, రోస్టర్ ఖాళీలు, ఇతర వివరాలన్నీ బ్లాగ్‌లో అందుబాటులో ఉన్నాయని ఏపీసీ పేర్కొన్నారు.

గుడ్ ఫ్రైడే నాడు.. పాస్టర్లకు గుడ్ న్యూస్

- గౌరవ వేతనం విడుదల హర్షణీయం
- జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు నాగరాజు



అనంతపురంరూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గుడ్ ఫ్రైడే నాడు పాస్టర్లకు గుడ్ న్యూస్ చెప్పారని జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. మండలంలోని రాచానపల్లిలో తన నివాసంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఏడు నెలల గౌరవ వేతనం రూ.30 కోట్లు విడుదల చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో 8,427 మంది పాస్టర్లు ఉన్నారనీ, వారికి 2024 మే నుంచి నవంబరు వరకు గౌరవ వేతనం నెలకు రూ.5వేలు చొప్పున విడుల చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

కాటేసిన కరెంటు తీగ

- మహిళకు విద్యుత్ షాక్
- కాపాడబోయిన ముగ్గురికి కూడా..
- వృద్ధుడి మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు



ఓబిలేసు మృతదేహం

బత్తలపల్లి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): కరెంటు తీగ కాటేసింది. విద్యుత్ షాక్ తగిలిన మహిళను కాపాడే ప్రయత్నంలో వృద్ధుడు మరణించగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని ఎం చెర్లోపల్లిలో శుక్రవారం విద్యుత్ ప్రమాదంలో చిట్రా ఓబులేసు (65) మరణించగా.. అతడి భార్య లింగమ్మ, కుమారుడు నాగభూషణ, లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెర్లోపల్లికి చెందిన కురవ ఓబులేసు భార్య లక్ష్మి ఇంటి వద్ద దుస్తులు ఉతుకుతుండగా.. పక్కనే ఉన్న విద్యుత్ సరఫరా అవుతున్న జీఏ వైరు తాకింది. ఆమె స్పృహతప్పి పడిపోయింది. గమనించిన అమె కుమారుడు మోక్షిత్ (8 ఏళ్లు) సమీపంలోని బంధువు చిట్రా ఓబులేసు ఇంటికి పరుగున వెళ్లాడు. తన తల్లి పడిపోయిందనీ వెంటనే రావాలంటూ చిట్రా ఓబులేసును కోరాడు. వెంటనే అతడితోపాటు భార్య లింగమ్మ, కుమారుడు నాగభూషణ పరుగున వెళ్లారు. లక్ష్మిని పైకి లేపేందుకు తాకారు. వారికీ విద్యుత్ షాక్ తగిలి, పడిపోయారు. మోక్షిత్ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌లో విద్యుత్ సరఫరా ఆపేశారు. స్పృహతప్పి పడిపోయిన నలుగురిని ప్రతేక వాహనాల్లో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఓబులేసు మృతిచెందాడని తెలిపారు. లింగమ్మ, లక్ష్మి, నాగభూషణ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

జీఏ వైరు తాకడంతోనే..

గ్రామానికి చెందిన రైతు శంకరయ్య.. అడవి పందుల నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్ వైరు లాగాడు. దానికి గ్రామంలోని స్తంభం నుంచి జీఏ వైరు ద్వారా విద్యుత్ సరఫరా తీసుకున్నాడు. కట్టెల పైనుంచి వైరు లాగాడు. విద్యుత్ స్తంభం సమీపంలోని కట్టె పడిపోవడంతో జీఏ వైరు కింద పడింది. ఆ వైరు తాకడంతోనే ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ డీఈ నరసింహారెడ్డి, ఏఈ శివయ్య, ఎస్ఐ సోమశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. రైతు శంకరయ్యపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ శివయ్య తెలిపారు. రైతు నిబంధనలకు విరుద్ధంగా జీఏ వైరును నివాస గృహాల సమీపంలోని స్తంభానికి కనెక్షన్ తీసుకుని, విద్యుత్ ప్రమాదానికి కారణమయ్యాడనీ, శంకరయ్యపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

- గొర్రెల కోసం వెళ్లిన నలుగురి మృతి
- మృతుల్లో ముగ్గురు జిల్లావాసులు



ధనాపురం నాగభూషణ, శీగుపల్లి మురళి, కొటిపి నాగరాజు (ఫైల్)

హిందూపురం/రాయచూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ముగ్గురు, కర్ణాటకుచెందిన ఒకరు మృతిచెందారు. రాయచూరు జిల్లా శాహపూర్ తాలూకాలో జరిగే సంతలో గొర్రెలు కొనేందుకు బొలెరో వాహనంలో వెళుతుండగా శుక్రవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో ప్రమాదం జరిగింది. వీరి వాహనం అదుపుతప్పి అమరపురం క్రాస్ వద్ద రోడ్డు పక్కన గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం ధనాపురం గ్రామానికి చెందిన నాగభూషణం(42), శీగుపల్లికి చెందిన మురళి(44), హిందూపురం మండలం కొటిపికి చెందిన నాగరాజు(40), కర్ణాటకలోని గౌరీబిదనూరు తాలూకా చిన్న బీరేపల్లికి చెందిన సోము(43) అక్కడికక్కడే మృతిచెందారు. వాహన డ్రైవర్ ఆనంద్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ మార్గంలో వెళ్లేవారు గమనించి, సమాచారం ఇవ్వడంతో గబ్బూరు పోలీసులు అతన్ని రాయచూరులోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను రాయచూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొటిపి నాగరాజు తరచూ తన బొలెరో వాహనంలో రాయచూరు ప్రాంతంలోని సంతకు వెళ్లి గొర్రెలను కొనుగోలుచేసి తెచ్చి స్థానికంగా విక్రయించేవాడు. ఆయనకు భార్య రూప, కుమారుడు ఉన్నారు. ధనాపురం నాగభూషణ పరిగిలో మటన్ షాపు నిర్వహిస్తుంటాడు. రాయచూరు ప్రాంతంలో గొర్రెలు తక్కువ ధరకు దొరుకుతాయని తెలుసుకుని మిగిలినవారితో కలిసి బయలుదేరాడు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. నాగభూషణకు భార్య సరోజమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. శీగుపల్లి మురళి గొర్రెల వ్యాపారి. అక్కడి నుంచి కొనుగోలు చేసి తెచ్చి స్థానికంగా విక్రయించేవాడు. ఆయనకు భార్య ఉన్నారు. కర్ణాటక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాధిత కుటుం బాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. మృతదేహాలను తెచ్చుకునేందుకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వెళ్లారు. కాగా, డ్రైవింగ్ చేస్తున్న ఆనంద్ అర్ధరాత్రి 12 గంటల తరువాత డ్రైవింగ్ బాధ్యతలను మరొకరికి ఇచ్చాడని పోలీసులు తెలిపారు. అయితే, ప్రమాదం జరిగిన సమయంలో వాహనాన్ని ఎవరు నడుపుతున్నారనే విషయమై స్పష్టత లేదని తెలిపారు.



వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలు



ప్రమాదంలో దెబ్బతిన్న బొలెరో వాహనం

వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాల్సిందే..

- అప్పటి వరకు పోరాటం ఆగదు
- సంఘాలు, పార్టీల నేతల ఉద్ఘాటన

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాల్సిందేననీ, అప్పటి వరకు పోరాటం ఆపేది లేదని వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు ఉద్ఘాటించారు. వక్ఫ్ సవరణ చట్టంపై ముద్రించిన సంచిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ కూడలి వద్ద నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ సర్కారు చేస్తున్న మతతత్వ రాజకీయాల్లో భాగంగానే ఈ వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. దేశంలోని మైనార్టీల హక్కులను కాలరాసే పన్నాగాన్ని లౌకిక, ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ.. ముస్లింలకు ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించని బీజేపీ.. వారి ఆస్తులు కాపాడతామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. క్రైస్తవులు, ముస్లింల విలువైన భూములను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికి బీజేపీ పన్నిన పన్నాగమే ఈ వక్ఫ్ సవరణ చట్టం అన్నారు. దీనిని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. చట్టాన్ని ఉపసంహరించుకునే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. సీపీఐ జిల్లా నాయకుడు నారాయణస్వామి మాట్లాడుతూ.. బీజేపీ చేస్తున్న మతతత్వ రాజకీయాలను ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాదాగాంధీ మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి దింపి లౌకిక ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. నగర వ్యాప్తంగా 25 మసీదుల వద్ద సంచికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీమ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు వలి, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, రైతు సంఘం నాయకుడు చంద్రశేఖర్, ఐఎంఎం బాషా, వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణమూర్తి, టిప్పుసుల్తాన్ సొసైటీ నజీర్, మసూద్, కేవీపీఎస్ నాయకుడు నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.



క్లాక్‌టవర్ వద్ద సంచికను ఆవిష్కరిస్తున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే


కర్ణాటకనాగేపల్లి, ఓడీసీలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): లోకంలో పాపసంహారానికే యేసుప్రభువు మరణబాధను అనుభవించారని పాస్టర్లు పేర్కొన్నారు. శుక్రవారం కర్ణాటకనాగేపల్లిలో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని కింగ్స్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.యేసు లోకాన్ని వీడిన రోజును గుడ్‌ఫ్రైడేగా క్రైస్తవులు బావిస్తారు. నలభైరోజులుగా ఉపావాసాలున్న క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థన లు నిర్వహించి ఉపావాసాలు వీడారు. వెంగళమ్మచెరువు, పెడప ల్లి, కొట్లపల్లి, నిడిమామిడి, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఓబుళదేవరచెరువు : మండల కేంద్రంలోని సీఅండ్ఐజీ మిషన్ చర్చిలో గుడ్‌ఫ్రైడేని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. యేసుక్రీస్తు శిలువలో చివరిగా పలికిన ఏడు మాటలను ధ్యానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి ప్రత్యేక ప్రార్థన లు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రెవరెడ్ డాక్టర్ ఎంజీ జయానందం, పాస్టర్ ఎంజీ ప్రేమావతి, సంఘ కార్యదర్శి దార్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న నిర్వహించనున్న ఆరోతరగతి ప్రవేశపరీక్ష హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని జగరాజుపల్లి మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ రమేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హాల్‌టిక్కెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్ నుంచి కాని డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్ సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చిని తెలిపారు.

పుట్టపర్తిలో చిరుజల్లులు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపానికి అల్లాడిపోతున్న జిల్లా కేంద్ర వాసులు శుక్రవారం సాయంత్రం పది నిమిషాల పాటు కురిసిన చిరుజల్లులతో కాస్త సేదతీరారు. ఎండవేడిమితో ఉక్కిరిబిక్కిరవుతున్న పట్టణవాసులకు చిరుజల్లులు కాసేపు ఉపశమనం కలిగించాయి.

నీటి తొట్టెలను త్వరగా నిర్మించాలి

తనకల్లు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం కింద మంజూరైన పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను వేగవంతంచేయాలని ఎంపీడీఓ రెడ్డెప్ప తెలిపారు. శుక్రవారం ఆయన ఉపాధి హామీ పథకం సిబ్బందితో మాట్లాడుతూ.. వేసవి వచ్చిందని, మూగజీవాల దాహార్తిని తీర్చడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మంజూరైన నీటి తొట్టెల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎక్కడైనా గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

జూదరుల అరెస్ట్

నల్లమాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.బండవాండ్లపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నవారిని శుక్రవారం సీఐ నరేంద్రరెడ్డి అరెస్టు చేశారు. పేకాట ఆతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.51,520 నగదు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

నల్లమాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని న్యూ బాలాజీ పాఠశాలలో మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్గనైజర్ పీట్ల రమణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సహకారంతో పుట్టపర్తి నియోజకవర్గంలో డీఎస్సీ పోటీ పరీక్షలకు చదువుతున్న పేద విద్యార్థుల కోసం ఈశిక్షణ ఇస్తున్నామన్నారు. 8919686029కి ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

27న న్యాయ సేవా సదస్సు

నల్లమాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయంలో ఈనెల 27న న్యాయ సేవా సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్పీపీ మండల కార్యదర్శి చంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ భూ సమస్యలున్న పేదలు ఈసదస్సుకు హాజరై అవగాహన చేసుకోవాలన్నారు. సదస్సుకు హైకోర్టు న్యాయవాది పి. నరసింహులు, న్యాయవాది కె. నరసింహులు ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

తనకల్లు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.సదుం గ్రామానికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ తొట్టి రెడ్డిశేఖర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టి.సదుం ప్రాథమికోన్నత పాఠశాలకు నిర్మించిన ప్రహరీగోడను ప్రారంభించడంతోపాటు, పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

బడిలో క్షుద్రపూజల కలకలం


ముగ్గు వేసి, ఎముకలు ఉంచిన దృశ్యం

నంబులపూలకుంట, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌకనపేట ప్రాథమికపాఠశాలలో క్షుద్రపూజలు చేశారన్న ప్రచారం కలకలం రేపింది. బడిలో గురువారం రాత్రి క్షుద్రపూజలు చేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. పాఠశాల తలుపులు వేసినా ప్రహరీ దాటుకుని వెళ్లి ఆవరణలో ముగ్గు వేసి, మూడు ఎముకలు పెట్టారని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం పాఠశాల తెరిచాక వాటిని చూసి ఆశ్చర్యపోయారు. ఎవరు, ఎందుకు చేశారో అర్థం కావడంలేదని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

స్థల విషయంపై కేసు నమోదు

గాండ్లపెంట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూపల్లి పంచాయతీకి చెందిన అమ్మాజీ స్థల విషయంపై పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల మేరకు.. అమ్మాజీకీ కదిరి పట్టణానికి చెందిన సాయి, ఇందిరమ్మ, నవీన్‌కుమార్‌రెడ్డి స్థలం ఇస్తామని నమ్మబలికి, ఇతర స్థలం చూపించారని, ఇందుకుగానురూ.33 లక్షలు నగదు, రూ.13 లక్షలు ఫోన్‌పే ద్వారా వారి డబ్బులు అప్పగించారని తెలిపారు. నకిలీ స్థలాలను చూపించి తననుంచి రూ.46 లక్షలు తీసుకున్నారని ఆమె ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు చెప్పారు.

అవోపా యూనిట్ అధ్యక్షుడిగా సుజన్‌కుమార్

ధర్మవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అవోపా ధర్మవరం యూనిట్ అధ్యక్షుడిగా సుజన్‌కుమార్‌ను ఎంపిక చేసినట్టు జిల్లా ఇన్‌చార్జ్ అన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. అవోపా యూనిట్ కార్యాలయంలో శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆవోపా ధర్మవరం నాయకులు శీభా నగేశ్‌గుప్తా, కాకుమాని శ్రీహరి, ఓవీ ప్రసాద్, ప్రసాద్, భాస్కర్, హేమంత్ కుమార్, వేణుగోపాల్, సుకుమార్ పాల్గొన్నారు.


సుజన్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ప్రైవేటు ఆపరేటర్‌తోనే పనులు

● సచివాలయ వ్యవస్థలో సిబ్బంది మెండు ● కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నా పట్టించుకోని అధికారులు

గాండ్లపెంట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తరుణంలో సిబ్బంది మెండుగా ఉన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం అందరికీ ఉన్నా పంచాయతీ అభివృద్ధి పనుల కోసం ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌తో పనులు చేయిస్తున్నారు. వైసీపీ పాలనలో అన్నిసేవలూ ఆయా పంచాయతీల్లోనే అందించడానికి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. సచివాలయాలకు రూ.లక్షలు ఖర్చు చేసి నూతన భవనాలు, ఫర్నీచర్, కంప్యూటర్లు అందించారు. సచివాలయంలో పనిచేసే ఉద్యోగులంతా దాదాపు కంప్యూటర్ పరిజ్ఞానం పొందిన వారే. పంచాయతీలోని వివిధ అభివృద్ధి పనులు, ఇంటి, నీటి పన్నుల వసూలు, ఇతర పనులు సచివాలయ సిబ్బంది కంప్యూటర్‌లో నమోదు చేయాల్సి ఉంది. వాటిపై సిబ్బంది దృష్టి సారించలేదు. 2015లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీల్లో కంప్యూటర్ ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. వారికి వేతనాలు గంటకు రూ.50 చొప్పున చెల్లించేవారు. ప్రతి పంచాయతీకి 20- 30 గంటల చొప్పున ఒక్కొక్క నెలలో ప్రైవేటు ఆపరేటర్లను నియమించుకునేందుకు అప్పటి ప్రభుత్వం వీలు కల్పించింది. అప్పట్లో సచివాలయ, కంప్యూటర్ వ్యవస్థ లేకపోవడంతో డేటా ఎంట్రీకోసం ప్రైవేటు ఆపరేటర్‌ను నియమించుకున్నారు. ఇప్పుడు కూడా వివిధ పనుల కోసం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌తో 15వ ఆర్థిక సంఘం నిధుల్లోని ప్రతి పంచాయతీ వారు ఒకనెల వేతనం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. సచివాలయ వ్యవస్థ వచ్చినా ఈతంతు కొనసాగడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయ సిబ్బందికి అప్పగిస్తే పనులు త్వరగా ముందుకు సాగుతాయని సర్పంచ్‌లు అంటున్నారు. అభివృద్ధి పనులకు ప్రణాళికలు, ఇతర పనులకు 14 పంచాయతీలకు కలిపి ఓ ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌తో ఎంపీడీఓ కార్యాయలంలో పనిచేయించుకుంటున్నారు. ప్రతి పంచాయతీ నుంచి ప్రైవేటు ఆపరేటర్‌కు జీతభత్యాలు చెల్లిస్తున్నారు.



గొడ్డువెలగల సచివాలయం

ప్రజాధనం వృథా



వైసీపీ ప్రభుత్వం సచివాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీరంతా కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారే. 2015లో పంచాయతీల్లో కంప్యూటర్ ఆపరేటర్ లేక, వివిధ బిల్లుల కోసం ప్రైవేటు ఆపరేటర్లను నియమించుకున్నారు. వారితో వివిధ అభివృద్ధి పనుల ప్రణాకలు తయారు చేసి, అధికారులకు పంపుతుండేవారు. ఇప్పుడు కావలసినంత సిబ్బంది ఉన్నారు. ప్రైవేటు ఆపరేటర్‌ను నియమించుకుని, జీతాలు చెల్లించడం అంటే ప్రజాధనం వృథా చేసినట్టే అవుతుంది.

- ప్రసాద్, మాజీ సర్పంచ్, గొడ్డువెలగల

అలాగే కొనసాగిస్తున్నాం

పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కోసం ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్లను కొనసాగిస్తున్నాం. పంచాయతీల్లో కంప్యూటర్ ఆపరేటర్ 2015 నుంచి కొనసాగుతున్నారు. వివిధ పనుల నిమిత్తం పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్‌డీ ప్రైవేటు కంప్యూటర్ల ఆపరేటర్లతో పనులు చేయించుకుంటున్నారు. వీరికి పంచాయతీల్లో వచ్చే గ్రాంటు నుంచి జీతాలు చెల్లిస్తున్నాం. వీరు అన్ని మండలాల్లో కొనసాగుతున్నారు.

- ఆంజనప్ప, డీఎల్‌పీఓ, కదిరి

తక్షణమే ప్రజా సమస్యల పరిష్కారం

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి : మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తున్నామని, ప్రజాసమస్యలపై తక్షణమే స్పందిస్తూ పరిష్కరిస్తున్నామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేద, మధ్యతరగతి ప్రజలు అనారోగ్యం బారిన పడినప్పుడు, భారంగా మారుతున్న వైద్యఖర్చులను గమనిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.1.95 కోట్లకుపైగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామని, తాజాగా మరో రూ.42లక్షలు కలిపి 2.37 కోట్లు ప్రజలకు అందించామని అన్నారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యం అన్నారు. రెవెన్యూ సమస్యలపై కలెక్టర్‌తో నిరంతరం సంప్రదిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ అంబటి అరుణశ్రీ, నాయకులు జింకా చంద్ర, గొట్లూరు చంద్ర, ఓబులేసు, పుల్లయ్య పాల్గొన్నారు.

నాట్యగురువు, కళాకారులకు సన్మానం

ధర్మవరం పట్టణానికి చెందిన లలితా నాట్యకళానికేతన్ గురువు బాబుబాలాజీ, కమలబాలాజీ, రామలాలిత్య శిష్య బృందాన్ని మంత్రి సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం సన్మానించారు. హైదరాబాద్‌లో గచ్చిబౌళి స్టేడియంలో 2023లో జరిగిన కూచిపూడి మహాబృంద నాట్యంలో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన 12 మంది కళాకారులకు మంత్రి చేతులమీదుగా సర్టిఫికెట్స్ మెడల్స్ అందజేసి సన్మానించారు. నాట్య గురువులు, కళాకారులను మంత్రి ప్రశంసించారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు తీసుకున్న వారితో మంత్రి సత్యకుమార్

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌పై సంబరాలు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేయడంపై మాదిగ ఉద్యోగ సమాఖ్య, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎస్సీ వర్గీకరణకోసం 30 యేళ్లుగా సుదీర్ఘ పోరాటం చేసిన ఫలితంగా నేడు కల సాకారం కాబోతుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు కేంద్రం తరఫున సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలుచేసి సహకరించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రంలో ఆర్డినెన్స్ జారీకి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రనాథ్, ఆనంద్, నాగరాజు, జయరాం, శ్రీనివాసులు, చిన్నప్ప, నాగప్ప, ఆదినారాయణ పాల్గొన్నారు.

ధర్మవరం : దళితుల్లో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు వీలుగా ఎస్సీ రిజర్వేషన్ అమలు కోసం ఆర్డినెన్స్ తీసుకురావడం హర్షనీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని ఆచరణలో చూపారన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

కదిరి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాయచోటి రోడ్డులోని ఇండియన్ గ్యాస్ గోడౌన్, అనంతపురం రోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం అగ్ని ప్రమాదాలపై ఆ శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జ్ అధికారి శ్రీధర్ ప్రమాదాలు జరిగితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అలాగే ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు.

కొత్తచెరువు : వేసవికాలంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయని జాగ్రత్తలు పాటిస్తే వాటి బారి నుండి తప్పించుకోవచ్చని అగ్నిమాపక శాఖ అదికారి నాగరాజునాయక్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని నెహ్రూకూడలిలో అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తూ శుక్రవారం ప్రజలకు అవగాహనకల్పించారు. గ్యాస్‌సిలిండర్ ద్వారాప్రమాదాలు సంబవిస్తే ఎలా బయటపడాలో, ఎలా ఆర్పాలన్న దానిపై డెమో ద్వారా మహిళలకు అవగాహన కల్పించారు.

21న ప్రత్యేక విద్యుత్ అదాలత్

ధర్మవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డ్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవణంలో ఈనెల 21న ఉదయం 11-30 గంటల నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్టు పుట్టపర్తి ఈఈ శివరాములు, ధర్మవరం ఏడీ లక్ష్మీనరసింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు పరిష్కారం కానీ సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు ద్వారా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత న్యాయాధికారి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులుఅంజనీకుమా ఆర్,స్వతంత్రర సభ్యులు విజయలక్ష్మీలు హాజరవుతున్నారన్నారు.

వెయ్యి రోజుల సంరక్షణే శిశువుకు రక్షణ కవచం

తనకల్లు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వెయ్యిరోజుల సంరక్షణే శిశువుకు రక్షణ కవచమని నల్లచెరువు సీడీపీఓ జయంతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నారేవాండ్లపల్లిలో పోషణా పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 8నుంచి 22వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణా పక్వాడ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలో ఉన్న గర్భవతులు, బాలింతలు, చిన్నారుల సమగ్రాభివృద్ధికోసం చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలురైతు కుటుంబాన్ని పరామర్శించిన అధికారులు

కుటుంబ స్థితిగతులు, అప్పులపై ఆరా

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంట బీసీకాలనీలో కౌలు రైతు కొడిమి రామాంజనేయులు అప్పుల బాధతో విషపు గుళికలు మింగి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై పలు పత్రికల్లో ప్రచురితం కావడంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతుకుటుంబ పరిస్థితిపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శించారు. రైతు అరుణని, వారి బంధువులను ఏయే పంటలు సాగుచేశారని, పంటలకోసం ఎంత అప్పుచేశారని, కుటుంబ స్థితిగతులపై ప్రాథమిక విచారణ చేశారు. పొలాన్ని కౌలుకు తీసుకుని పంటల కోసం కుటుంబజీవనానికి అప్పులు తెచ్చి వాటికి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తెచ్చారు. వీటిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ధైర్యంగా ఉండాలని కుటుంబసభ్యులకు భరోసాని ఇచ్చారు.

తిమ్మమాంబ ఆలయం చుట్టూ 12 గంటలు ప్రదక్షిణ


శ్రీనివాసును సన్మానిస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని గూటిబైలు గ్రామంలో వెలసిన ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మార్రిమాను వద్ద తిమాంబ ఘాట్ చుట్టు ఓ భక్తుడు 12గంటలు ప్రదక్షిణలు చేశాడు. శుక్రవారం ధర్మవరానికి చెందిన చింతకాయల శ్రీనివాసులు సూర్యదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాస దీక్షతో ప్రదక్షణ చేశారు. గతంలో ధర్మవరం శివాలయంలో రెండుమార్లు ఇలాగే ప్రదక్షిణలు చేసినట్లు చెప్పారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు దుశాలు, పూలమాలతో సర్పంచ్ విష్ణుమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు నారాయణస్వామి, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, టూరిజం గైడ్ మనోహర్ తదితరులు సత్కరించారు.

లో ఓల్టేజీ సమస్య తీర్చాలని ధర్నా

కొత్తచెరువు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక బీసీ కాలనీ మహిళలు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శుక్రవారం సాయంత్రం ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ..గత కొంతకాలగాఆ తమ కాలనీకి లో, హై ఓల్టేజ్ సమస్యతో ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, బల్బులు కాలిపోతున్నాయన్నారు. పలు మార్లు విద్యుత్‌శాఖ అదికారులకు తెలిపిన పట్టించుకోలేదన్నారు.దీంతో తాము మా సమస్యను పరిష్కరించేంతవరకు ధర్నాను విరమించమని అక్కడేబీష్మించారు. దీంతోట్రాన్స్‌కో ఏడీ రామిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మహిళలతో మాట్లాడి అనంతరం కాలనీలో పర్యటించి మరో అదనంగా ట్రాన్స్ పార్మర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. మండలంలో ఎక్కడెక్కడా విద్యుత్‌సమస్యలున్నాయో తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్‌నాయక్, సిబ్బందికి సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తనకల్లు, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన మినిస్ట్రీ ఆఫ్ హోమ్‌ఆఫైర్ సెంట్రల్ కమిటీ సభ్యుడు ముక్తియార్‌బాషాను శుక్రవారం ఘనంగా సన్మానించారు. తలుపుల మండలంలోని బత్రేపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న చౌడేశ్వరి అమ్మవారి ఆలయానికి రూ.20వేల విరాళం అందచేశారు. దీంతో ఆలయ కమిటీ వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వడెర్ల సంఘం అధ్యక్షులు గంగరాజు, ఆలయ కమిటీ సభ్యులున్నారు.

కుటుంబ సాధికారిక నమోదు పూర్తి చేయాలి

నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు నాగేంద్రప్రసాద్

ధర్మవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కుటుంబ సాధికారిక సారథి ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు నాగేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో ఏ స్థాయిలో పదవులు పొందాల న్నా, నామినేటేడ్ పదవులు పొందాలన్నా కచ్చితంగా కుటుంబ సాధికారిక సారథిగా నమోదు అయిఉండాలన్నారు. ఈ నెల 24వతేదీలోగా పూ ర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గ, పార్లమెంట్, రాష్ట్ర స్థాయిలో కమిటీలు వేస్తారని అన్నారు. కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీ కమిటీల్లో, నామినేటెడ్ ప దవుల్లోనూ అవకాశం లభిస్తుందన్నారు. అ నంతరం ముగ్గురికి రూ.94,398 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సమావేశంలో నాయకులు కమతం కాటమయ్య, మహేశ్‌చౌదరి, పణికుమార్, పురుషోత్తంగౌడ్, రామాంజనేయులు, లక్ష్మన్న, పెద్దన్న, రహీంబాషా,శీన, మహేశ్, రామకృష్ణ, నారాయణస్వామి పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న నాగేంద్రప్రసాద్

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై స్పెషల్‌డ్రైవ్ : ఎస్పీ


జగరాజుపల్లి ప్రధానరహదారిలో వాహన తనిఖీలను పరివేక్షిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకే జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక వాహనాల తనిఖీ (స్పెషల్ డ్రైవ్) నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వి.రత్న పేర్కొన్నారు. డీజీపీ హరీష్‌గుప్తా ఆదేశాల మేరకు గురువారం రాత్రి 10 గంటల నుంచి 11 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జగరాజుపల్లి ప్రధాన రహదారిలో ఎస్పీ వాహన తనిఖీలను స్వయంగా పర్యవేక్షించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్, అధికలోడ్, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ లింగన్న, ఏఆర్ ఆర్ఐలు వలి, మహేష్ పాల్గొన్నారు.

భూములపై హక్కులను కోల్పోవద్దు


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నంబులపూలకుంట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పూర్వీకుల నుంచి హక్కు కలిగిన భూములను కోల్పోకుండా రైతులు జాగ్రత్త పడాలని సీపీఎం రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జౌకల గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. రైతుల జీవన పరిస్థితులు, భూవివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంత భూముల్లో సోలార్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సోలార్ మాయలో పడి పరిహారం వస్తుందని, ఉపాధి చూపిస్తారని ఆశపడి భూమిలేని నిరుపేదలుగా రైతులు నిలిచిపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, గంగిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దళిత పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలివ్వాలి

డిక్కి రాయలసీమ జోనల్ అధ్యక్షుడు కోలా వెంకటరమణ


మాట్లాడుతున్న వెంకటరమణ

కదిరి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): దళితులు పారిశ్రామిక వేత్తలుగా తయారు కావడానికి ప్రత్యేక ప్రోత్సకాలు ఇవ్వాలని దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిక్కి) రాయలసీమ జోనల్ అధ్యక్షుడు కోలా వెంకటరమణ కోరారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీఎస్టీలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడానికి రాయితీని 45 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని గురువారం తిరుపతిలో జరిగిన 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ అరవింద్‌పనగారియాతోపాటు కమిటీ సభ్యులకు విన్నవించామని తెలిపారు. ఎస్సీఎస్టీలకు ప్రత్యేక పారిశ్రామిక రాయితీ ఇవ్వాలని కోరారు. దళిత వర్గాల్లో నైపుణ్యత పెంచడానికి ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలన్నారు. దళితులకు క్రెడిట్ గ్యారెంటీ పథకాన్ని అమలు చేయడంలో బ్యాంకు లు నిరాదరణ చూపుతున్నాయన్నారు. బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక


ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సభ్యులు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పలక ఆంజనేయులు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కమిటీని ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు, కోశాధికారిగా కొత్తమారెప్పతోపాటు కార్యవర్గాన్నిఎన్నుకున్నారు. మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా కత్తి ఆనంద్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రదొడ్డెప్ప, ఆంజనప్ప, శ్రీనివాసులు, రామక్రిష్ణ, గంగన్న, అక్కులప్ప, బావన్న, నరసింహులు, రామాంజ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కదిరిఅర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అడపాలవీధికి చెందిన సుదర్శన్‌యాదవ్ కనిపించలేదని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు చంద్రకళ భర్త సుదర్శన్‌యాదవ్ గురువా రం రాత్రి ఆమెగొ డవపడి ము త్యాలచెరువు పాలబావి వద్ద ద్విచక్రవాహనం, సెల్ పెడుతున్నట్లు ఫోన్ చేసి చెప్పారని, అక్కడికెళ్లి చూడగా ద్విచక్రవాహన, సెల్ ఉందని, సుదర్శన్ క నిపించలేదన్నారు. స్నేహితు లు, బంధువు ల వద్ద విచారించి నా ఆచూకి కనిపించకపోవడం తో పోలీసులకు ఫిర్యాదు చేసిన ట్లు చెప్పారు.

న్యూస్ బాక్స్

ఐముక్తేశ్వరుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పెనుకొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐముక్తేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పురస్కరించుకుని స్వామివారికి అర్చకులు కన్నాస్వామి, మూర్తిస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం గావించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గుట్టూరులో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిలో ఆర్థిక అభివృద్ధి కల్పించడమే లక్ష్యమన్నారు. మహిళలకు మూడు నెలల ఉచిత కుట్టుశిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా కోఆర్డినేటర్ రవినాయక్, బీసీ కార్పొరేషన్ పవన్, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, గొల్లపల్లి రామక్రిష్ణ, మల్లికార్జున పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గోరంట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగంపల్లి సచివాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. వీస్‌వెల్ఫేర్ సొసైటీ, ఆరోమా హెల్త్‌కేర్ సంయుక్తంగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు, ప్రజలు 50మందికి కంటి చికిత్సలు చేశారు. 23మందికి శుక్లాలున్నట్లు గుర్తించి శస్త్రచికిత్స లు జరపాలని నిర్ణయించారు. వైద్య సిబ్బంది సుధాకర్, సా యిమోహన్, అమృతవర్షిణి, సాయిలీలా, ప్రత్యూష పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

సోమందేపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ సిద్దలింగప్ప తెలిపారు. ఉదయం 10 గంటలకు జూలకుంట పంచాయతీ నుంచి సుద్దకుంటపల్లివరకు నిర్మించనున్న రోడ్డు పనులకు భూమిపూజ చేయనున్నారు. అనంతరం 11గంటలకు నక్కలగుట్ట కాలనీ సమీపంలో చాకర్లపల్లి కుంటవద్ద తెగిన హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జర్నలిస్ట్ కాలనీలో చోరీ


ఇంట్లో చెల్లాచెదురుగా పడిన వస్తువులు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మడకశిర వెళ్లే దారి లో ఉన్న జర్నలిస్ట్ కాలనీలో శుక్రవారం చోరీ జరిగింది. కాలనీలో నివాసముంటున్న నరేష్ రొద్దం మండ లం తురకలాపట్నం సమీపంలోని సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. ఇతనికి రెండురోజులు బయట విధులు ఉండటంతో భార్యను తల్లి ఇంట్లో వదిలి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి తలుపులు, బీరువా పగలకొట్టి ఐ దు తులాల బంగారు, రూ.10వేలు నగదు, దేవునిరూమ్‌లో 300 గ్రాముల వెండి చోరీ అయినట్లు పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్ ద్వారా ఆనవాళ్లు సేకరించారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రావెల్స్ బస్సు, లారీ ఢీ.. ఒకరికి గాయాలు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనిపేట బ్రిడ్జి సమీపంలో 44వ జాతీయరహదారిపై శుక్రవారం ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు పెనుకొండ సమీపంలోని గోనిపేట బ్రిడ్జివద్దకు రాగానే ముందువెళ్తున్న లారీ సడన్‌బ్రేక్ వేయడంతో వెనుకే వస్తున్న బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్న షరీఫ్ అనే వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న నిర్వహించనున్న ఆరోతరగతి ప్రవేశపరీక్ష హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని జగరాజుపల్లి మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ రమేష్‌బా బు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హాల్‌టిక్కెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్ నుంచి కాని డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చిని తెలిపారు.

పుట్టపర్తిలో చిరుజల్లులు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపానికి అల్లాడిపోతున్న జిల్లా కేంద్ర వాసులు శుక్రవారం సాయం త్రం పది నిమిషాల పాటు కురిసిన చిరుజల్లులతో కాస్త సేదతీరారు. ఎండవేడిమితో ఉక్కిరిబిక్కిరవుతున్న పట్టణ వాసులకు చిరుజల్లులు కాసేపు ఉపశమనం కలిగించాయి.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

నల్లమాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని న్యూబాలాజీ పాఠశాలలో మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్గనైజర్ పీట్ల రమణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సహకారంతో డీఎస్సీ పోటీ పరీక్షలకు చదువుతున్న పేద విద్యార్థుల కోసం ఈశిక్షణ ఇస్తున్నామన్నారు.

విరివిగా నీటికుంటలు

- జిల్లాకు 1362 మంజూరు
- ఒక్కొక్క కుంట నిర్మాణానికి రూ.38వేలు
- భూగర్భజలాల పెంపునకు ప్రభుత్వం ప్రోత్సాహం

మడకశిర, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నీటిని పొదుపు చేసి భూగర్భజల మట్టాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం నీటికుంటల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలో 1362 నీటికుంటలను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించింది. వీటి నిర్మాణాలకు రూ.5 కోట్లకు పైగానే ఖర్చు అవుతుంది. ధర్మవరం నియోజకవర్గంలో 183, హిందూపురం 313, కదిరి 334, మడకశిర 304, పుట్టపర్తి నియోజకర్గంలో 228 నీటికుంటల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఒక్కొక్క కుంట నిర్మాణానికి రూ.38 వేలు మంజూరు చేశారు. ప్రతి రైతు తన పొలంలో నీటికుంటలను తవ్వుకుని.. వర్షపు నీటిని నిల్వ చేసుకుంటే భూగర్భ జలాల పెరుగుతాయి. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు ఆ నీటితో వివిధ రకాల పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంది. దీంతో వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాదు. కూలీలకు స్థానికంగానే పనులు దొరుకుతాయి. భూగర్భజల మట్టం తగ్గదు. వేసవిలో కూడా బోర్లలో నీరు సమృద్ధిగా ఉంటుంది. నీటికుంటల పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు. సొంత పొలం ఉన్న రైతులు 5 మీటర్ల పొడువు, 5 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతు వరకు కుంటను తవ్వకోవచ్చు. దీనికి రూ.38వేలు మంజూరు చేస్తారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నీటి కుంటల నిర్మాణం చేపట్టింది. దీనివల్ల మంచి ఫలితాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. వర్షాభావం నెలకొన్నప్పుడు పంటలకు నీటి తడి అందించి కాపాడుకోవచ్చని అంటున్నారు.


పొలంలో నీటికుంటను తవ్వుతున్న రైతులు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాకు ప్రభుత్వం 1362 నీటికుంటలను మంజూరు చేసింది. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి. వర్షాలు కురిసినప్పుడు కుంటల్లో నిలువ ఉంచితే భూగర్భజలాలు పెరిగి బోరుబావుల్లో సమృద్ధిగా లభిస్తాయి. దాదాపు రూ.5 కోట్ల వ్యయంతో జిల్లాలో నీటికుంటల నిర్మాణం చేపడుతున్నాం. వర్షాభావ పరిస్థితుల్లో ఈ నీటితో పంటలకు రక్షకతడులు అందించవచ్చు.

- విజయేంద్ర ప్రసాద్, ప్రాజెక్ట్, డైరెక్టర్, డ్వామా

విద్యుత్ మీటర్ రీడర్లను ఆదుకోండి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం నాయకులు

మడకశిర రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో ఎన్నేళ్లుగా పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఉద్యోగభద్రత కల్పించి ఆదుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యుత్ మీటర్ రీడర్ల అసోసియేషన్ నాయకులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అధ్యక్షుడు దస్తగిరి, కోశాధికారి సలింబాషా ఉన్నారు. వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో 20 ఏళ్లుగా మీటర్ రీడర్లుగా పనిచేస్తున్నామన్నారు. ప్రస్తుతం రీచార్జి మీటర్లు రావడంతో తాము ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రతతోపాటు ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఫక్రుద్దీన్, కిషోర్‌నాయుడు, బాషా పాల్గొన్నారు.

132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయండి

అగళి: మండలంలో 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, సవితమ్మ, ఎంపీ పార్థసారథిలను టీడీపీ నాయకులు కోరారు. మండలం కర్ణాటక సరిహద్దులో ఉన్నందున విద్యుత్ సమస్యతో సతమతమవుతున్నామన్నారు. ప్రత్యేకంగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే మండలంలో విద్యుత్ సమస్య ఉండదన్నారు. నాలుగు మండలాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. శ్మశాన వాటిక లేదని, స్థలం మంజూరు చేయాలని మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ శివ, రాములుతోపాటు జడ్పీటీసీ ఉమేష్ మండల కన్వీనర్ కుమారస్వామి క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్, తదితరులు మంత్రులకు విన్నవించారు.

పోరాటాలతోనే పావగడకు తాగునీరు


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు శివప్రసాద్

పావగడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తాలూకా ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, రైతు, దళిత సంఘాలు చేసిన పోరాటాలతోనే పావగడకు తుంగభద్ర నుంచి తాగునీరు సాధించుకున్నామని బీజేపీ రైతుమోర్చా ఉపాధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నందినిఅప్ప నివేదిక ప్రకారం పావగడకు సాగు, తాగునీరు అందించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు అన్నివిధాలా అన్యాయం చేశాయని తీవ్రంగా ఖండించారు. దీనిపై 2010నుంచి 2015వరకు అనేక స్వచ్ఛంద సంస్థలు నిరాహారదీక్ష, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టడం ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. తుంగభద్ర నీరు తరలింపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ 21న సన్మాన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 200మందికిపైగా పోరాట యోధులకు సన్మానం చేయనున్నారు. తాలూకాలోని ప్రతి పల్లె నుంచి తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పురుషోత్తంరెడ్డి, పావగడ వెంకటేశ్, రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప, నరసింహారెడ్డి, రాజశేఖర్, గిరీష్, సాకే కుమార్ పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు రద్దుచేయాలని ముస్లింల ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీలు, మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లు చట్టాన్ని రద్దుచేయాలని శుక్రవారం హిందూపురంలో ముస్లిం మైనార్టీలు భారీ ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం మసీదుల్లో ప్రార్థనల అనంతరం పట్టణంలోని అన్ని మసీదుల నుంచి అల్‌హిలాల్ పాఠశాల వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి వేలాదిగా గురునాథ్ సర్కిల్ మీదుగా అంబేడ్కర్, ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం ఇందిరమ్మ సర్కిల్‌లో దువా చేశారు. ర్యాలీలో పాల్గొన్నవారు చేతికి నల్ల రిబ్బన్ కట్టుకుని జాతీయజెండా, నల్ల జెండాలతో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. మత పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు రద్దుచేసేంతవరకు పోరాటం ఆగదన్నారు. దేశంలో వక్ఫ్ కింద లక్షలాది ఎకరాల భూమి ఉందన్నారు. వీటి విలువ లక్షల కోట్లేనన్నారు. అయితే ఈ ఆస్తులపై కొంతమంది కార్పొరేట్ల కన్ను పడిందని ఆరోపించారు. కొత్తచట్టంలో కొన్ని వివాద అంశాలున్నాయన్నారు. వక్ఫ్ ఆస్తులపై జిల్లా కలెక్టర్లకు అధికారం ఇవ్వడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. బీజేపీకి, నరేంద్రమోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుప్రీం కోర్టు కూడా కేంద్రాన్ని ప్రశ్నించిందని దీంతో ముస్లింల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని చట్టాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, పురం ఇన్చార్జ్ దీపిక, ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్‌నిశ్చల్, నాయకులు వేణురెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే


అమరాపురంలో బోధనలు చేస్తున్న పాస్టర్

పెనుకొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు సర్వమానవాళి పాప పరిహారం కోసం శిలువనెక్కి శాంతి బోధచేసిన ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వివిధ చర్చిల్లో గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం బైబిల్ మిషన్ చర్చిలో పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు యేసయ్య శిలువ మీద చేసిన బోధనలను వివరించారు. అనంతరం ఉపవాస దీక్షలో ఉన్న భక్తులతో కలిసి ఉపవాసం విరమింపజేశారు. స్థానిక సీఅండ్‌ఐజీ చర్చిలో పాస్టర్ ఫ్రాన్సెస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. యేసు శిలువపై చేసిన బోధనలను క్రైస్తవులకు వివరించారు.

అమరాపురం: మండల కేంద్రంలోని బెరకా, షాలోమి, కపెర్నో ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీస్తు జననం, మరణం, పునరుత్థానం, ఈమూడూ అద్భుతాలే అన్నారు. కార్యక్రమంలో ఫాదర్ శ్రీనివాస్, ప్రకాషరావు, సాల్మన్‌రాజ్, క్రైస్తవులు పాల్గొన్నారు.

పావగడ: సమస్త ప్రజల పాప క్షమాపణ కొరకు ఏసు సిలువలో ప్రాణం త్యాగం చేసిన రోజును గుడ్‌ఫ్రైడేగా నిర్వహించుకుంటామని యాక్లన్ జిప్సిచర్ప్ ఫాదర్ దేవిడ్‌రాజు అన్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిలో క్రైస్తవులు సామూహిక ప్రార్థనలు చేశారు. పాపం చేసిన వాడికి నరకం, పుణ్యం చేసిన వారికి స్వర్గం భూలోకంలోనే ఉంటుందని ఆయన అన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉపవాస దీక్షతో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



బైబిల్ మిషన్‌చర్చిలో బోధనలు చేస్తున్న పాస్టర్ సుధాకర్, ఉపవాస దీక్షను విరమిస్తున్న క్రైస్తవులు

తాగునీరు అందించండి మహాప్రభో..!

- రోడ్డెక్కిన తిమ్మాపురం గ్రామస్థులు


తాగునీటి కోసం రాస్తారోకో చేస్తున్న ఇందిరమ్మ కాలనీ వాసులు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం పెనుకొండ నగర పంచాయతీ తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీవాసులు శుక్రవారం రోడ్డెక్కారు. కాలనీలో రెండు నెలల నుంచి నీరు రాలేదని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించలేదన్నారు. దీంతో పాత జాతీయరహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కౌన్సిలర్ గిరి, టీడీపీ నాయకులు దత్తారెడ్డి మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.

ప్రభుత్వ బడుల్లో పిల్లల్ని చేర్పించండి


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సోమందేపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని శుక్రవారం ఉపాధ్యాయులు లక్ష్మీకస్తూరి, నాగరాజు కోరారు. మండలంలోని చాకర్లపల్లి గ్రామంలో ఎన్రోల్‌మెంట్‌డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో ఉన్న సదుపాయాలు, సౌకర్యాలు వివరించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు జూన్ వరకు ఆగకుండా అంతలోపే బడిఈడు పిల్లల్ని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చర్పించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. అంగనవాడీ కేంద్రాల్లో ఐదేళ్లు పూర్తయిన పిల్లల వివరాలు సేకరించాలన్నారు. వీరికోసం ప్రత్యేక రిజిష్టర్ ఏర్పాటు చేయాలన్నారు. 5వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులను సమీపంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో చేర్పించాలన్నారు.

అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్


రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు దిట్టలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధి దిష్టిబొమ్మను అంబేద్కర్ సర్కిల్ వద్ద దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ వారి కుటుంబంతోపాటు ఆ పార్టీలో ముఖ్యులంతా భారతదేశాన్ని దోచుకున్నారన్నారు. నేషనల్ హెరాల్డ్ స్కాం ద్వారా రూ.2వేల కోట్లు మనీ ల్యాండరింగ్ జరిగిందన్నారు. దేశంలో జరిగిన పెద్ద కుంభకోణాల్లో కాంగ్రెస్ పార్టీవారే ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రవితేజరెడ్డి, భాగ్యలక్ష్మి, కౌన్సిలర్ అంజలి, చక్రపాణిరెడ్డి, నరసింహమూర్తి, హరిప్రసాద్, గోవిందరెడ్డి, శిరీష పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


అగ్ని ప్రమాదంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

హిందూపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడల్లో అగ్ని ప్రమాదాలపట్ల యాజమాన్యం, కార్మికులు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి ప్రభాకర్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తూమకుంట పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదాల నిర్వహణపై అవగాహన కల్పించారు. బేసిక్‌ఫైర్‌పై శిక్షణతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఐరన్, కెమికల్ పరిశ్రమల్లో మరింత అప్రమత్తత అవసరమన్నారు. కార్మికులు విధుల్లో ఉన్న సమయంలో అగ్ని ప్రమాదం జరిగితే ప్రాణాలు ఎలా రక్షించుకోవాలో వివరించారు. ఎక్సెల్ ర బ్బర్ పరిశ్రమ మేనేజర్ శ్రీధర్, హెచ్ఆర్ రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.